www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 1 | | సంచిక: 284 | | 3-5-2026 | | ఆదివారం | | పేజీలు: 8 | | వెల : రూ.5/- |

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత



తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా 'తెలంగాణ రక్షణ సేన'ను ఏర్పాటు చేసినట్లు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. 'పాంచజన్యం' పేరుతో ఐదు ప్రధాన అంశాలను అజెండాగా తీసుకున్నామని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతామని ఆమె స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తెలంగాణ జాగృతి సంస్థ యథావిధిగా కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆమె వివరించారు. 3

ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం వంద రోజుల్లో రూ. **6,000** కోట్లు చెల్లిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధుల ఖర్చుకు సంబంధించిన ప్రాధాన్యతలను ఉద్యోగులే నిర్ణయిస్తారని ఆయన వెల్లడించారు. శనివారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో భేటీ అయిన ముఖ్యమంత్రి, వారి సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పలు కీలక హామీలు ఇచ్చారు. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారుల కమిటీని సీఎం ఆదేశించారు.



# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

జూన్ 1వ తేదీలోగా ఆరోగ్య భద్రతా కార్డుల పంపిణీ



### రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు

### పీఆర్సీ నివేదికపై అధికారులకు ఆదేశం..

### ఉద్యోగ సంఘాలతో భేటీలో వరాల జల్లు

**హైదరాబాద్, మే 2:** వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతో శనివారం సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2 లో

## సిరిసిల్లవాసుల మృతిపై కేటీఆర్ సంతాపం

### ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి

శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. 2



## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

- 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్' లోగో ఆవిష్కరణ
- స్థానిక ప్రతిభను ప్రపంచంతో అనుసంధానించడమే లక్ష్యం : మంత్రి శ్రీధర్

2





## హర్మూజ్ జలసంధింపై కొత్త నియమాలు

- పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు
- ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన

.. వివరాలు 4లో

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు: ట్రంప్



4

## ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనం

ఆర్యవైశ్య మహాసభ అట్టర్ ఫ్లాప్

- తెలంగాణ నేతల బహిష్కరణ
- రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యామ్ సుందర్


తెలంగాణ ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనమే కొనసాగుతోందని, తెలంగాణ వైశ్యనేతలు దూరంగా ఉండటమే ఇందుకు కారణమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యాంసుందర్ ఆరోపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా అమరవాది లక్ష్మీనారాయణ శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేయగా, సభ ఆశించిన స్థాయిలో సాగకపోగా, అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. 3



## సంపన్న అమ్మాయిలే టార్గెట్

- ఇన్‌స్టా కేడీల వలపు వల
- ట్రాప్ చేసి లక్షల్లో వసూళ్లు.. ఇద్దరు నిందితుల అరెస్ట్
- వ్యాపారవేత్త కుమార్తె నుంచి రూ. 13 లక్షల దోపిడీ

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మాయిలను ట్రాప్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న అర్జున్, అతని సోదరుడు రాజీవ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2




## బాలికపై సామూహిక అత్యాచారం

- ప్రేమ జంటను అడ్డుకొని దోపిడీ..
- అదుపులో ఇద్దరు నిందితులు
- మహబూబ్‌నగర్‌లో దారుణం

2



## బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే

అక్కడ చెరువు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి

సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

2






## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

**ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మే 2:** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ' అనే అంతర్జాతీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్ ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

## బాలికపై సామూహిక అత్యాచారం

**మహబూబ్‌నగర్, మే 2:** జిల్లాలోని హన్వాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఒంటరిగా ఉన్న ఓ ప్రేమ జంటపై దుండగులు దారుణానికి ఒడిగట్టారు. ప్రియుడిని బెదిరించి డబ్బులు వసూలు చేయడమే కాకుండా, బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. నగర శివారులోని ఓ మైదాన ప్రాంతానికి ప్రేమ జంట వెళ్లింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన దుండగులు వారిని అడ్డుకున్నారు. ప్రియుడిని భయపెట్టి ఆయన వద్దనున్న డబ్బును బలవంతంగా లాక్కున్నారు. వెంటనే అప్రమత్తమైన ప్రియుడు.. పోలీస్ సహాయం కోసం డయల్ 100కు కాల్ చేశాడు. అయితే.. పోలీసులు వచ్చేలోపే దుండగులు బాలికపై దారుణంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను రక్షించి ప్రాథమిక విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## సంపన్న అమ్మాయిలే టార్గెట్

**ఇన్‌స్టా వేదికగా వలపు వల.. ఇద్దరు కేడీల్లో ఒకరి అరెస్ట్**

**హైదరాబాద్, మే 2:** ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతులను, ముఖ్యంగా సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మాయిలను మాయమాటలతో ట్రాప్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న అర్జున్, అతని సోదరుడు రాజీవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో అర్జున్, రాజీవ్‌ను ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ అమ్మాయిలను బుట్టలో వేసుకోవడం నిందితుల ప్లాన్ అని పోలీసులు చెప్పారు. ఇప్పటికే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మోసాల్లో రాజీవ్ క్రియాశీలకంగా వ్యవహరించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. పరారీలో ఉన్న రాజీవ్‌ను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బెంగళూరులో పట్టుకున్నారు. నిందితులు యువతులను ట్రాప్ చేయడానికి ఒక పక్కా ప్లాన్ ప్రకారం వ్యవహరించేవారని పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాసవంతమైన హోటల్స్‌లో దిగిన రీల్స్, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారని అన్నారు. తాము కూడా పెద్ద ధనవంతులమని యువతులను నమ్మించేవారని చెప్పారు. హైదరాబాద్‌లోని విలాసవంతమైన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో నివసించే సంపన్న కుటుంబాల పిల్లలను ఈ నిందితులు ప్రధానంగా లక్ష్యంగా చేసుకునేవారని వెల్లడించారు. అమ్మాయిలను పరిచయం చేసుకున్న కొద్దిరోజులకే ప్రేమ నటిస్తూ, పెళ్లి చేసుకుంటామని నమ్మబలికేవారని అన్నారు. యువతుల నమ్మకాన్ని పొందిన తర్వాత అసలు పని మొదలుపెట్టేవారని తెలిపారు. సాన్నిహిత్యం పెరిగిన తర్వాత అమ్మాయిల వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి, వాటిని అడ్డం పెట్టుకుని భయపెట్టడం, అత్యవసరాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసేవారని పోలీసులు వెల్లడించారు. నిందితులు దాదాపు 10 మందికి పైగా యువతులను ఇదే తరహాలో ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెను కూడా ప్రేమ పేరుతో వేధించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ సుమారు రూ. 13 లక్షల నగదును వసూల్ చేశారని పోలీసులు తెలిపారు. నిందితుడు అర్జున్‌పై కేవలం జూబ్లీహిల్స్‌లోనే కాకుండా, నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యా యని అన్నారు. నిందితులను సమగ్రంగా విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. వీరు ఇంకా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు?, ఈ ముఠాలో ఇంకా ఎవరైనా సభ్యులు ఉన్నారా?, వీరు వసూలు చేసిన సొమ్మును ఏం చేశారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రాజీవ్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి, అర్జున్‌తో కలిపి విచారించే అవకాశం ఉంది.

## సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

**ఐపిఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్ ముఠాల ఆటకట్టు**

**హైదరాబాద్, మే 2:** ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి స్కామ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏప్రిల్ నెలలోనే 184 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తొలగించగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో 801 ఫేక్ యాడ్స్‌ను గుర్తించారు. అమాయకులను టార్గెట్ చేసి వారిని బెట్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌ల వైపు మళ్లించే ప్రొఫైల్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఐపీఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించే ఈ ప్రొఫైల్స్ ద్వారా యువతను ఆకర్షించి మోసం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిరంతర సైబర్ పెట్రోలింగ్‌లో భాగంగా ఇప్పటివరకు 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను, 1,903 పెయిడ్ ప్రమోషనల్ అడ్వటంల్గ÷జ్‌మెంట్లను గుర్తించి తొలగించారు. ఈ ప్రొ÷ల్స్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటికే 6 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. అక్రమ డబ్బు మార్గాలపై దృష్టి సారించిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి

ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా



కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

# సిరిసిల్ల వాసుల మృతిపై కేటీఆర్ సంతాపం

**ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి**

**హైదరాబాద్, మే 2:** శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో



సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనం

- ఆర్యవైశ్య మహాసభ అట్టర్ ఫ్లాప్
- తెలంగాణ నేతల బహిష్కరణ
- రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యామ్ సుందర్

**హైదరాబాద్, మే 2:** తెలంగాణ ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనమే కొనసాగుతోందని, తెలంగాణ వైశ్యనేతలు దూరంగా ఉండటమే ఇందుకు కారణమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యాంసుందర్ ఆరోపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా అమరవాది లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేయగా, జరిగిన సభ ఆశించిన స్థాయిలో సాగకపోగా, అట్టర్ ఫ్లాప్ అయిందని ఆయన అన్నారు. కేవలం ఆంధ్ర నాయకులకే పరిమితమైన ఈ సభకు తెలంగాణ నేతలెవరూ హాజరు కాలేదని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అమరవాది ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తెలంగాణ ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో బహిష్కరించడం ద్వారా అమరవాది వర్గానికి గట్టి బుద్ధి చెప్పారని శ్యామ్ విమర్శించారు. ముఖ్యంగా వైశ్య పితామహుడు గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్త, వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ సుజాత, వంటి



హేమాహేమిలతో పాటు వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, బొల్లం సంపత్ వంటి వారు అమరవాది ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదన్నారు. ప్రోటోకాల్ ఉన్న నాయకులు సైతం ఈ 'అక్రమ ఎన్నిక'ను నిరసిస్తూ దూరంగా ఉండటం, అమరవాది వర్గం పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అమరవాది వర్గానికి తెలంగాణ వైశ్య సమాజం ఈ విధంగా చెంపదెబ్బ కొట్టిందని శ్యాంసుందర్ మండిపడ్డారు. నిన్నటి వరకు ఆంధ్ర నేతలను విమర్శించిన వారే, నేడు టీజీ వెంకటేష్, కనకరాజు వంటి ఆంధ్ర నాయకుల అండ కోసం పాకులాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గతంలో శ్రీశైలం సత్రం విషయంలో ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టిన అమరవాది, ఇప్పుడు తన పదవి కోసం ఆంధ్ర నేతలను ఆశ్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 2-3 ఓట్ల సాంకేతిక మెజారిటీతో, అంగబలం, అర్థబలంతో గెలిచినంత మాత్రాన అది నిజమైన విజయం కాదని, తనకు వచ్చిన 520 ఓట్లు నీతినిజాయితీకి ప్రతీకలని ఆయన స్పష్టం చేశారు÷ళివలం కొద్దిమంది రైస్ మిల్లర్ల నాయకులతో తూతూమంత్రంగా సభ జరుపుకోవడం హాస్యాస్పదమని, ఈ అక్రమ పదవి శాశ్వతం కాదని ఆయన హెచ్చరించారు. వైశ్య మహాసభలో జరిగిన అక్రమాలు, అన్యాయంపై త్వరలోనే న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామని, తప్పు చేసిన వారికి కోర్టు ద్వారా బుద్ధి చెబుతామని శ్యాంసుందర్ హెచ్చరించారు. పదవుల కోసం, వ్యాపారాల కోసం కొందరు బానిసలుగా మారవచ్చు కానీ, ఆత్మాభిమానం ఉన్న ఆర్యవైశ్య జాతి అన్యాయాన్ని ఎప్పుడూ సహించదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పేరుతో ఆంధ్రా నేతలతో సభ నిర్వహించి అమరవాది వర్గం ఏకాకిగా మిగిలిపోయిందని, భవిష్యత్తులో తమ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

**అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి**

**ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ**

**హైదరాబాద్, మే 2:** హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరవే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు.



సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# కామారెడ్డి ఎమ్మెల్యేపై పరువనష్టం కేసు

**షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్ దాఖలు**



**కామారెడ్డి, మే 2:** కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సుమంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయవాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియజేశారు. గత ఫిబ్రవరి 17, 21 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్‌పై అత్యాచారం కేసు ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో ఫిర్యాదు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. క్రిమినల్ డిఫెన్స్ కింద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఈ నెల 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్లు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం



- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత

**హైదరాబాద్, మే 2:** తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.



## ఉత్తమ్ కేసీఆర్ కోవర్ట్

### పౌరసరఫరాలో అత్యంత అవినీతి

### నిజామాబాద్ ఎంపి అర్వింద్ ఆరోపణలు

**హైదరాబాద్, మే 2:** కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్ట్‌లనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**రంగారెడ్డి, మే 2:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. డీజిల్ పోసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కుటుంబం.. రెండేళ్లుగా బడంగ్‌పేట్ న్యూ మారుతి నగర్‌లో నివాసముంటోంది. ఈ కుటుంబానికి చెందిన ఓ యువతి గండిపేటలోని ఎంజీఐటీ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. రోజూలాగే కాలేజీకి వెళ్లిన ఆమె ఈ మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిందని.. ఆ తర్వాత ఇంట్లో ఉన్న డీజిల్‌ను పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## అర్ధరాత్రి యువకుడిపై దాడి

### ప్రాణాలు పోయేలా కొట్టి పడేసిన దుండగులు

### ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో యువకుడికి చికిత్స

**వనపర్తి, మే 2:** వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన జరిగింది. శివ (27 ) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముందు వదిలి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

### వేధింపులకు గురిచేయడం సరికాదు

### ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు



**హైదరాబాద్, మే 2:** కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎ÷-లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం



**సిద్దిపేట, మే 2:** రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కొనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

## ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా

### బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్



**హైదరాబాద్, మే 2:** ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపం అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన ఫోన్ ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. కానీ దానికి సమ్మాధనం చెప్పకుండా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారం హైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

## కూకట్‌పల్లిలో విషాద ఘటన

### నవదంపతుల ఆత్మహత్య



**హైదరాబాద్, మే 2:** హైదరాబాద్ కూకట్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజుల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయి-ఌజన్ తీసుకొన్నట్లు సమాచారం. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవకముందే ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్ లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లాడుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలియదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్తీక్ ఇంట్లో క్లూస్ టీం తో ఆధారాల సేకరిస్తున్నాం.. సూసైడ్ నోట్ లభించలేదని సీఐ శోభన్ తెలిపారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
3 మే 2026




సంపాదకీయం

# ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ!

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువువుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనేపరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమీషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# హర్మూజ్ జలసంధింపై కొత్త నియమాలు

- పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు
- ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన





**టెహ్రాన్, మే 2:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హర్మూజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హర్మూజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం, ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్టు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, 'పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం' అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

# ఓట్ల లెక్కంపులో ఈసీ మరో కీలక నిర్ణయం

- అదనపు పరిశీలకుల నియామకం


**కోల్‌కతా, మే 2:** ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్నికల సంఘం అదనపు పరిశీలకులను మోహరించింది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాల్లో మొత్తం 165 మంది ఎన్నికల, 77 మంది పోలీసులను పరిశీలకులుగా నియమించింది. ఓట్ల లెక్కింపు పక్రియ సురక్షితంగా, పారదర్శకంగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతల ఏర్పాట్లను పోలీసు పరిశీలకులు పర్యవేక్షిస్తారని తెలిపింది. ఈసీఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు పేర్కొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికి 86 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మరోవైపు ఓట్ల లెక్కింపు తర్వాత తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇదే జిల్లాలోని ఫల్తాలో వందలాది మంది నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలోని టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణ హాని ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తమపై దాడులు చేస్తామని వారు బెదిరించారని ఆరోపించారు. సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఆ ప్రాంతాన్ని సందర్శించి.. భద్రతకు భరోసా ఇచ్చారు.




స్థానిక తృణమూల్ అభ్యర్థి జహంగీర్ ఖాన్ ఈ ఆరోపణలను ఖండించారు. ఇదంతా భాజపా పనేనని ఆరోపించారు.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

## మరోమారు మెలిక పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్, మే 2:** పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్‌-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# సుప్రీంలో మమతకు చుక్కెదురు

## కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం



**న్యూఢిల్లీ, మే 2:** సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.



# లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

## ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా

**జమ్మూ, మే 2:** క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్ధార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.



# ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య

**న్యూఢిల్లీ, మే 2:** దక్షిణ ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రాంతంలో జడ్జి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. జడ్జి అమన్ కుమార్ శర్మ (30) మృతదేహాన్ని ఆయన ఇంట్లో చూసిన బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వారు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జడ్జి అమన్ కుమార్ శర్మ 2018లో సింబయాసిస్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2019 జూన్ 19న ఢిల్లీ జుడీషియల్ సర్వీసెస్‌లో చేరారు. తన కెరీర్‌లో ఆయన పలు కోర్టుల్లో వివిధ సివిల్, క్రిమినల్ కేసులను డీల్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆయన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# గిరిజనులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని మంగి పంచాయతీ పరిధిలో గల కౌటగాం గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. గిరిజనులు ఇప్పటివరకు వంట చెరుకుపై ఆధారపడి వంటలు కొనసాగిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన అటవీశాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గిన్నెదరి రేంజ్ అటవీశాఖ అధికారి సంధ్యారాణి ఆధ్వర్యంలో కనెక్షన్ ఉన్న లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను నింపించి పంపిణీ చేశారు. గ్రామంలోని చాలా మంది మహిళలు గ్యాస్ అందుబాటులో లేక వంట చెరుకుతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గిన్నెదరి రేంజ్ అటవీశాఖ అధికారులు రవి, రాము, గ్రామ పెద్దలు బక్కు బుజ్జి రావు తదితరులు హాజరయ్యారు. ఈ సదుపాయం కల్పించిన అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# తన్వీర్ పటేల్‌కు శుభాకాంక్షల వెల్లు వ



**ఉద్యమ కెరటం, భీంపూర్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన తన్వీర్ పటేల్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శనివారం ఆయనను భీంపూర్ మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, గోన ఉప సర్పంచ్ ముశ్రాన్ హైమ్మద్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు దౌలత్ రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు తన్వీర్ పటేల్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధి కోసం ఆయన విశేషంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తన్వీర్ పటేల్ నిరంతరం కృషి చేస్తారని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకాంత్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లు వ




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బోరంచు శ్రీకాంత్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం అమన్ ఫౌండేషన్ చైర్మన్ అర్ఫత్ ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్ కోలేట్కర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అర్ఫత్ ఖాన్ మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డి నాయకత్వంలో మార్కెట్ కమిటీ ఆదర్శంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పరమేశ్వర్ కోలేట్కర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రైతులకు పారదర్శక సేవలు అందుతాయని, మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. నాయకత్వ పటిమ ఉన్న వ్యక్తికి ఈ పదవి రావడం సంతోషకరమని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అందరికీ శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతి లబ్ధి దారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు

## జిల్లా కలెక్టర్ హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక నియోజక వర్గ స్థాయి సమావేశామునకు అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం.డెవిడ్, ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ మునిసిపల్ చైర్మన్ మొంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ , ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఇరుకుళ్ళ మంగ, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వార్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అర్హులైన లబ్ధి దారులకు పథకాలు అందిస్తున్నదని కలెక్టర్ అన్నారు. ఆసిఫాబాద్ నియోజక వర్గ స్థాయి లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 24209 మందికి చేయూత పెన్షన్ దారులకు 22 కోట్ల 50 లక్షల రూపాయలను అందించిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నియోజక వర్గంలో 36179 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణి చేస్తున్నామని అన్నారు. రైతు భరోస పథకం ద్వారా లక్ష 22 వేల మంది రైతులకు 221 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. రైతు భీమ పథకం క్రిందా మరణించిన 6791 రైతులకు వారి కుటుంబాలకు 36 కోట్ల 35 లక్షల రూపాయలు రైతు భీమ డబ్బులు జమ చేయడం జరిగిందని కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, పతకం క్రిందా 6957 లబ్ధి దారులకు 59 కోట్ల 38 లక్షల రూపాయలను లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందించడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు 5029 ఇండ్లను మంజూరి చేయడం జరిగిందని అన్ని ఇండ్లు పురోగతిలో వున్నాయని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు 39223 కుటుంబాలకు ఇప్పటి వరకు 6 కోట్ల 27 లక్షల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. 500 రూపాయలకి గ్యాస్ సిలిండర్ 29161 కుటుంబాలకు సబ్సిడీ రూపాయలు 24 కోట్ల 62 లక్షల రూపాయలు లబ్ధి దారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఆద్వర్యం లో పాఠశాల అభివృద్ధి మౌళిక వసతుల కల్పన పనులు కొరకు 503 పాఠశాలలో 163 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విద్య రంగా అభివృద్ధికి కృషి చేస్తుందని వచ్చే విద్య సంవత్సరములో ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు అల్పాహారం , స్కూల్ కిట్టులను అందించడం జరుగుతుందని ఇంటర్ విద్యార్థులకు మద్యాహ్న భోజనం పథకం ప్రారంబించడానికి చర్యలు తీసుకుంటదన్నారు. 2వ విడతలో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధి దారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్చి 6 నుండి జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా పారిశుద్యం, ఫైళ్ళ క్లియరెన్స్, రహదారి బద్రత , సంక్షేమ వారం, డ్రగ్స్ నివారణ, వంటి కార్యక్రమాలను ప్రజా ప్రతి నిదుల సహకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 4 నుండి 9 వరకు రైతు వారోత్సవ కార్యక్రమములో ప్రజా ప్రతి నిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గోనాలన్నారు. ఇళ్ళ గణన కార్యక్రమములో భాగంగా మే 10 వరకు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోవాలన్నారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తిసుకున్నప్పటి నుండి కలెక్టర్ గారు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారని. అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి నిధులు మంజూరి చేసి మారు మూల గ్రామాలకు త్రాగు నీరు అందించాలన్నారు. రహదారి సౌకర్యాలు కల్పించడానికి నిధులు మంజూరు చేయాలన్నారు.ఈ కార్యక్రమములో అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు,ఎం పి డి ఓ లు, పంచాయతి కార్యదర్శులు, స్వయం సహాయక మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య మంత్రి పర్యటన పై ఏర్పాటుకు సిద్దంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడి హేట్టి గ్రామం వద్ద ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని రాష్ట ముఖ్యమంత్రి , మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నత అధికారుల పర్యటన త్వరలో ఉన్నందున పూర్తీ స్థాయి ఏర్పాట్లకు సిద్దంగా వుండాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్ల పై అధికారులతో నిర్వహించిన సన్నాహాక సమావేశం లో ఎస్ పి నితికా పంత్ , అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్ , యం.డెవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్ డి ఓ లోకేశ్వర్ రావు, తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్య మంత్రి పర్యటన కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రణహిత నది పై బరాజ్ నిర్మాణ ప్రాంతానికి పర్యటించే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లకు సిద్దంగా వుండాలని కలెక్టర్ అన్నారు. హెలిపాడ్, బాంకేడ్లు, వేదిక, వి ఐ పి, వి వి ఐ పి,గ్యాలరి, అధికారుల పాసులు, మీడియా పాసులు, పారిశుధ్య పనులు త్రాగు నీరు, వి ఐ పి , వి వి ఐ పి లకు త్రాగు నీరు, అల్పాహారం, బోజనాలు, ప్రజలకు త్రాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, వేదిక అలంకరణ, మెడికల్ సిబ్బంది క్యాంపులతో సిద్దంగా వుండాలని విద్యుత్తు సరఫరా ప్రత్యామ్నాయంగా జనరేటర్ అందుబాటులో వుండేలా చర్యలు పర్యటన ఎలాంటి లోపాలు జరుగకుండా ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మిడి హెట్టిపై ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవికుమార్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాకు ప్రాణాధారమైన తుమ్మిహెట్టి వద్ద నిర్మించే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ప్రజల అనుమానాలను నివృత్తి చేసి పనులు ప్రారంభించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వారికి సభ్యుడు బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చత్రపతి భవన్ లో జిల్లా కార్యదర్శి కూషన, రాజన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి ముందడుగు వేయడం ఆహ్వానించదగ్గదన్నారు. ఈనెల 7న సీఎం పర్యటన కంటే ముందుగా ప్రాజెక్టు నిర్మాణం పై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ప్రాజెక్టు ఎత్తు 150 అడుగులకు పెంచడంతో సాగు భూమి పెరిగే అవకాశం ఉంటుందని అయితే 148 నుండి 150 అడుగులకు పెంచడానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని అనుమతి తేవాల్సిన బాధ్యత సిర్పూర్ ఎమ్మెల్యే తో పాటు, ఆదిలాబాద్ ఎంపీ, రాష్ట్రానికి చెందిన మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి లపై ఉందని తెలిపారు. వారు మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 1000 కోట్ల ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిందని అయితే దానిని రెండు విడతల్లో మంజూరు చేసి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. గత రెండు బడ్జెట్లలో అరకొరగా నిధులు కేటాయించారని ఇలా చేస్తే ప్రాజెక్టు నిర్మాణానికి 20 సంవత్సరాలు పైగా పడుతుందని తెలిపారు. దీనిని ప్రభుత్వం గమనించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటిని గ్రావిటీ ద్వారా లేదా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మళ్ళీ ఇస్తారా అనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మొక్కుబడిగా ప్రాజెక్టును ప్రారంభించకుండా నిర్మాణం పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రజల అనుమానాలను నివృత్తి చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రిని కలిసే అవకాశం తమకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కు సన్మానం

**ఉద్యమ కెరటం, భీంపూర్:** జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన తన్వీర్ పటేల్‌ను శనివారం పిప్పలకోటి సర్పంచ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా దాసరి రమేష్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో కీలక బాధ్యతలు చేపట్టిన తన్వీర్ పటేల్ నాయకత్వంలో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సమస్యల పరిష్కారం, మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తన్వీర్ పటేల్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ పదవి ద్వారా జిల్లా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్లి(టి) సర్పంచ్ కామన్ అశోక్, నాయకులు దండే సుదర్శన్, రేణికుంట్ల శ్రీనివాస్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ పనుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



## ఎస్.ఈ. ఉత్తమ్ జాడే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** విద్యుత్ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆసిఫాబాద్ టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు మరియు సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే, డీ ఈ టెక్నికల్ & సేఫ్టీ ఆఫీసర్ సుధాకర్ గారితో కలిసి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. ఉత్తమ్ జాడే మాట్లాడుతూ విద్యుత్ సంబంధిత పనులు చేసే సమయంలో సిబ్బంది మరియు అధికారులు అందరూ ఖచ్చితంగా అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ఏమరపాటుగా ఉండటం వల్ల జరిగే ప్రమాదాలు ప్రాణాపాయానికి దారితీస్తాయని, కావున క్షేత్రస్థాయిలో పని చేసేటప్పుడు రక్షణ పరికరాలను తప్పని సరిగా ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి ప్రాణం ఎంతో విలువైందని, నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏ డీ ఈ శ్రీనివాస్, వివిధ సెక్షన్ల ఏ ఈ లు, సబ్ ఇంజనీర్లు, ఫోర్ మెన్లు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఈ నెల 3వ తేదీన జిల్లాలో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్ లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు 316 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సెంటర్ లోకి అనుమతించడం జరుగుతుందని, మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమతో అడ్మిట్ కార్డు, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు గల ఒరిజినల్ ఐడి కార్డ్ (ఆధార్, పాన్, స్టుడెంట్ ఐడీ కార్డ్ మొదలైనవి) వెంట తెచ్చుకోవాలని, ప్రతి అభ్యర్థి అడ్మిట్ కార్డు పై ఒక పోస్ట్ కార్డ్ సైజు పోటో అతికించుకొని రావాలని, అదనంగా ఒక పాస్ ఫోటో తెచ్చుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి చేతి రుమాలు, ఏదైనా మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం, బెల్టు, ఉంగరం, గొలుసు, చెవిపోగులు మొదలైన ఆభరణాలు, ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరం, పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ తీసుకురావద్దని, ఏ అభ్యర్థి వద్ద నైనా అటువంటి వస్తువులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షా గదిలో మొబైల్ ఫోన్, పైన పేర్కొన్న ఇతర సహాయక సామగ్రి ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లయితే అది తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించబడుతుందని, అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడానికి, భవిష్యత్ పరీక్షలకు హాజరు కాకుండా నిషేధించబడుతుందని తెలిపారు. పారదర్శకమైన వాటర్ బాటిల్ కు అనుమతి ఉంటుందని



తెలిపారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని, పరీక్ష ప్రారంభం నుండి చివరి వరకు మొత్తం విడియో రికార్డ్ చేయడం జరుగుతుందని, పరిక్షా కేంద్రంలో 22 సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 28 మంది ఇన్విజిలేటర్లు, ఒక పరిశీలకుడు, ఇద్దరు చీఫ్ సూపరింటెండ్స్ ఉంటారని, వీరితో పాటు పరీక్షా విధులలో కేటాయించిన సిబ్బంది మాత్రమే ఉంటారని, ఇతరులకు ఎలాంటి ప్రవేశం లేదని తెలిపారు. పరీక్ష ముగిసే వరకు ఏ అభ్యర్థిని బయటికి పంపడం జరగదని, ప్రతి గదిలో 24 మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. పత్రికా, మీడియా విలేకరులకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

**ఉద్యమ కెరటం, సొనాల:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి లోలపు పోశెట్టి, కాంగ్రెస్ నాయకులు తుల అజయ్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన సొనాల మండలానికి చెందిన విద్యార్థులను శనివారం ఘనంగా సన్మానించారు. సొనాల మండల కేంద్రంతో పాటు పార్డి(కె) గ్రామానికి చెందిన చౌహాన్ స్మరణ్ సింగ్, లాట్య సూరజ్ సింగ్, అలాగే సొనాల గ్రామానికి చెందిన షేక్ జోహాతస్కిన్, కసిరి మధులీతలను లోలపు పోశెట్టి, తుల అజయ్, చౌహాన్ హరి సింగ్‌లు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని పేర్కొన్నారు.



అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతూ మెరుగైన ఫలితాలు సాధించిన ఈ విద్యార్థులు గ్రామానికి, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారని అన్నారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత చదువులు అభ్యసించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్, సర్పంచులు శ్రీరామ్, లక్ష్మణ్, బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జుంగాల భోజన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆత్మ డైరెక్టర్ ముండే శ్రీధర్, బాశేటి సుదర్శన్, మాజీ కోఆప్షన్ సభ్యులు మహెమూద్, సంగ్రామ్, భీంరావు పాటిల్, జి.భోజరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో గ్రామాల అభివృద్ధి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రజా పాలనతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శనివారం సత్తుపల్లి పట్ట ణంలోని ఎంఆర్ గార్డెన్ సిద్ధారం రోడ్‌లో "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు సమాచారం అందించి సమస్యల పరిష్కారానికి చర్యలు



చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికల ద్వారా నియోజకవర్గంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. నిజమైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ప్రతినిధులు, ఏఎంసీ చైర్మన్లు, కౌన్సిలర్లు, పంచాయతీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీపక్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఘాటుగా తిప్పికొట్టారు. జిల్లాలోని జొన్న రైతుల కష్టాలను గుర్తించి, వారి పంట కొనుగోలుకు కాంగ్రెస్ నాయకత్వం యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుందని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్, నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు అల్లూరి సంజీవరెడ్డి, టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుజాత కలిసి ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పరిస్థితిని వివరించారని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రులు వెంటనే జొన్నల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గతంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రైతుల కోసం చేయలేదని



విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతులను మోసం చేసిన చరిత్ర ఆ పార్టీలదేనని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతుహిత కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు మారాలని హితవు పలికారు. విమర్శలు మానుకుని జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతుల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శనివారం ఆయనను భీంపూర్, గుడిహత్నూర్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీకాంత్ రెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. భీంపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, గోన ఉపసర్పంచ్ ముశ్రాన్ హైమద్ తన అనుచరులతో కలిసి చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువతకు, రైతులకు ఈ నియామకం ఎంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు. అలాగే గుడిహత్నూర్ మండల సీనియర్ నాయకులు దౌలత్ రావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం శ్రీకాంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రభుత్వానికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని, ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా పారదర్శకంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బోరంచు బాధ్యతల స్వీకారం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు మార్కెట్ కమిటీ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు పెద్ది సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేముల నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొని శ్రీకాంత్ రెడ్డిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కలుపు మందులు, నకిలీ విత్తనాల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మీరటి రాజేశ్వరి తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాల వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, నిషేధిత కలుపు మందుల వల్ల కలిగే నష్టాలను వివరించాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో దుకాణాలు, డీలర్లపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ సంబంధిత శాఖల సమన్వయంతో నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, విత్తనాలు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



## • రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగాన్ని వ్యతిరేకించి యువత వాటికి దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం నస్పూర్ మండల కేంద్రంలోని ఎంఎం గార్డెన్స్‌లో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగంతో ఆరోగ్యానికి, భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలుగుతుందని, సరైన మార్గంలో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం చట్టపరమైన సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కుటుంబ స్థాయిలో అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, యువత భవిష్యత్తును కాపాడడంలో సమాజం సహకరించాలని కోరారు. అనంతరం డ్రగ్స్ దుష్ప్రభావాలను వివరించే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యే సమాజ అభివృద్ధికి పునాది





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** విద్యే సమాజ అభివృద్ధికి పునాది అని, ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, మున్సిపల్ మేయర్ దర్ని మధుకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు జవాబుదారీతనంతో తీసుకోవాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడల నిర్మాణంతో పాటు నాణ్యమైన బోధన కోసం నిపుణులైన ఉపాధ్యాయులను నియమించామని చెప్పారు.

లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం దాదాపు వెయ్యి మంది విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్యపై నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఆసక్తిగా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు మంచి వాతావరణం కల్పించాలని, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమని అన్నారు. కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో పురోగతి కనిపించాలని సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నత అర్హతలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**






**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"ను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవనంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాలనలో పారదర్శకత కోసం దరఖాస్తుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మత్తులకు ప్రాధాన్యతనిస్తూ 99 రోజుల ప్రణాళికలో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని సూచించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, "ప్రగతి పథం–సకలజన హితం– మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో ముందుకు సాగుతోందని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామపంచాయతీల సర్పంచులకు సర్టిఫికెట్లు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రైతులకు కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. డ్రగ్స్ నిషేధ పోస్టర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ స్టాళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, టీజీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన పథకాలు ప్రజలకు చేరువ కావాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన పథకాలు ప్రతిఒక్కరికీ చేరువ కావాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవనంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ఆమె కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశాలకు హాజరై వినడమే కాకుండా, సామాజిక బాధ్యతతో పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రాణ రక్షణే ముఖ్యమని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీజీఎస్సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, సంక్షేమ శాఖాధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలనతో అభివృద్ధి దిశగా ముందుకు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజాపాలనతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" అమలుపై శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజాపాలనలో అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం సహించబడదని హెచ్చరించారు. దరఖాస్తుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మత్తులకు ప్రాధాన్యతనిస్తూ పనులను వేగవంతం చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు గ్రామస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. "ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, టీజీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్, అదనపు ఎస్పీ సురేందర్ రావు, సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు, డీపీఓ రమేష్, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రతిష్ట కోసం యువత నడుం బిగించాలి



- **ఓంకారేశ్వర ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామీజీ**

**ఉద్యమ కెరటం, హత్నూర:** దేశ ప్రతిష్ట కోసం యువత నడుం బిగించాలని, సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఓంకారేశ్వర ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామీజీ అన్నారు. శనివారం మండల కేంద్రం హత్నూర గ్రామంలోని రామాలయం వద్ద నిర్వహించిన హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అనేక సంవత్సరాలుగా దేశ ప్రతిష్ట కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు నిబద్ధతతో ఉండాలని, దేశ గౌరవం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మాన్ని కాపాడకపోతే ఇతర మతాల ప్రభావం పెరిగే అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. మన దేవుళ్లను నమ్మి పూజలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర మతాల దేవుళ్లను హిందూ బంధువులు ఎందుకు పూజించాలనే ప్రశ్నను ఆయన ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. మన ధర్మ పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ వక్తలు పెంటా రెడ్డి, రాజకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, హత్నూర గ్రామ పెద్దలు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అమలు చేయాలని, విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు, మున్సిపల్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, లక్షెట్టి పేట మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు అందించడంతో పాటు చౌకధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సదుపాయం కల్పించడంతో పాటు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన వారికి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.విద్య రంగ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, సమస్యల శాశ్వత పరిష్కారానికి సమిష్టి కృషి అవసరమని అన్నారు. జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

**ఎల్ఐసీలో మాత్రం 20శాతానికే పరిమితం**

**చట్టానికి చేసిన మార్పులపై కేంద్రం నోటిఫై**

**న్యూఢిల్లీ, మే 2:** బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్‌ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా




ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం

# అమెరికాలోనే ఇంధన ధరల మోత

**సర్వీసులను నిలిపివేసిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సంస్థ**




**న్యూయార్క్, మే 2:** ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజగా ప్రకటించింది. త్వరలో అన్ని కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెడతామని శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్నామని, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మరోదారి లేక ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ వెల్లడించింది. 'అన్ని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సర్వీసులను రద్దు చేశాము. మా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు వెళ్లవద్దని సూచిస్తున్నాము' అని ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కస్టమర్ సర్వీస్ అందుబాటులో లేదని కూడా సంస్థ వెబ్‌సైట్‌లో నోటీసు కనిపించింది. అయితే, ఇప్పటికే టికెట్లు కొన్న వారికి డబ్బుల రీఫండ్ పక్రియను త్వరలో ప్రారంభిస్తామని కూడా సంస్థ తెలిపింది. ఇక స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల నిలిపివేతపై కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న సంస్థ పునర్‌వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌పై బాండ్ హోల్డర్స్‌తో మార్చి నెలలో అంగీకారం కుదిరిరిందన్నారు. అయితే, అకస్మాత్తుగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని అన్నారు. కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయడం మినహా మరో దారి లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. 'వ్యాపారాన్ని కొనసాగించేందుకు వందల మిలియన్ల నిధులు కావాలి. మా వద్ద అంత డబ్బు లేదు. నిధులను సమీకరించే అవకాశం కూడా లేదు. ఇది చాలా విచారకరమైన పరిణామం' అని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక అమెరికాలో విమాన ఇంధన ధరలు రెండింతలు అయ్యాయి. దీంతో, అనేక ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ ఏడాది లాభాల అంచనాలను తగ్గించుకున్నాయి. కార్యకలాపాల విస్తరణపై పెట్టుబడులకు కూడా బ్రేక్ చెప్పాయి. అప్పుల భారం, కార్యనిర్వహణ వైఫల్యాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ 2024 నవంబర్‌లోనే దివాలా తీసినట్టు ప్రకటించింది. ఆ తరువాత పునర్‌వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌లో భాగంగా మళ్లీ కార్యకలాపాలను ప్రారంభించింది. కంపెనీని పూర్తిగా గ్టటెక్కించేందుకు మరో ప్రణాళికపై కూడా చర్చలు జరుగుతున్నాయి. సంస్థను ఆదుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం ఒక ఎ÷-లాన్‌ను ప్రతిపాదించింది. ఇదే తన చివరి ఆఫర్ అని కూడా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలోనే శనివారం స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

# రుణం త్వరగా తీర్చే చిట్కాలు




**హైదరాబాద్, మే 2 :** సొంత ఇల్లు కోసం బ్యాంకుల నుంచి గృహ రుణాలు తీసుకోవడం చాలా మందికి సాధారణమే. అయితే ఆ రుణాన్ని తిరిగి చెల్లించే సమయంలో వడ్డీ భారం ఎక్కువగా ఉ ండటం వల్ల సంవత్సరాల పాటు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కానీ కొన్ని చిన్న ఆర్థిక ప్రణాళికలు పాటిస్తే, 30 ఏళ్ల రుణాన్ని కూడా దాదాపు 17 ఏళ్లలోనే ముగించవచ్చు. ఉదాహరణకు రూ. 50 లక్షల రుణాన్ని 8 శాతం వడ్డీతో 30 ఏళ్లకు తీసుకుంటే, నెలవారీ వాయిదా సుమారు రూ. 36,688 ఉంటుంది. అయితే అదే రుణాన్ని 20 ఏళ్లలో తీర్చాలని నిర్ణయించుకుంటే నెలవారీ వాయిదా పెరిగినా, మొత్తం వడ్డీ గణనీయంగా తగ్గుతుంది. దీని వల్ల మొత్తం చెల్లించాల్సిన మొత్తం కూడా తగ్గిపోతుంది. అదేవిధంగా, ప్రతి సంవత్సరం 12 వాయిదాలకే పరిమితం కాకుండా ఒక అదనపు వాయిదా చెల్లించడం (సంవత్సరానికి 13 వాయిదాలు) ఎంతో ఉ పయోగకరం. ఈ విధానం ద్వారా రుణం కాలపరిమితి గణనీయంగా తగ్గి, 30 ఏళ్ల రుణాన్ని సుమారు 17 ఏళ్లలోనే పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఇంకా కొంత అదనపు డబ్బు వచ్చినప్పుడు ప్రీపేమెంట్ చేయడం, వడ్డీ రేట్లు తగ్గినప్పుడు రీఫైనాన్స్ చేసుకోవడం వంటి పద్ధతులు కూడా రుణభారాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే గృహ రుణాన్ని త్వరగా ముగించడం అసాధ్యం కాదు.

# క్రెడిట్ కార్డ్ వసూలులో దౌర్జన్యానికి నో చెప్పండి

**హైదరాబాద్, మే 2 :** క్రెడిట్ కార్డ్ బిల్లులు చెల్లించలేదని రికవరీ ఏజెంట్లు వినియోగదారులను వేధిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఇటువంటి చర్యలకు అడ్డు కట్ట వేయడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ కఠినమైన నిబంధ నలు అమలు చేస్తోంది. రుణం తిరిగి చెల్లించడం వినియోగ దారుడి బాధ్యత అయినప్పటికీ, వసూలు ప్రక్రియ చట్టబద్ధంగా ఉండాలి తప్ప దౌర్జన్యంగా ఉండకూడదు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్యలోనే కస్టమర్లను సంప్రదించాలి. ఈ సమయానికి బయట ఫోన్ చేయడం లేదా ఇంటికి రావడం నిబంధనలకు విరుద్ధం. కస్టమర్లతో ఎప్పుడూ మర్యాదగా ప్రవర్తించాలి. బూతులు తిట్టడం, బెదిరించడం, శారీరకంగా లేదా మానసికంగా వేధించడం పూర్తిగా నిషేధం. అలాగే, వినియోగదారుడి అప్పు వివరాలను ఇతరులతో పంచుకోవడం కూడా నేరంగా పరిగణించబడుతుంది. ఏజెంట్లు ఇంటికి వచ్చినప్పుడు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును చూపించాలి. తప్పుడు కేసులు పెడతామని లేదా జైలుకు పంపిస్తామని బెదిరించడం చట్ట విరుద్ధం. ఒకవేళ ఇలాంటి వేధింపులు ఎదురైతే, ముందుగా సంబంధిత బ్యాంక్‌కు ఫిర్యాదు చేయాలి. అక్కడ స్పందన లేకపోతే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. పరిస్థితి తీవ్రమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. కాల్ రికార్డులు, వీడియోలు వంటి సాక్ష్యాలను సేకరించుకోవడం కూడా వినియోగదారులకు ఉపయోగపడుతుంది. మొత్తానికి, రుణం చెల్లించడం ఎంత ముఖ్యమో, వినియోగదారుల గౌరవం, భద్రత కూడా అంతే ముఖ్యమని ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది.






# గ్యాస్ బుకింగ్‌లో కొత్త నిబంధనలు

**హైదరాబాద్, మే 2 :** ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన చమురు సంస్థలు ధరలు, పంపిణీ విధానాలను సమీక్షించే క్రమంలో, మే 1 నుంచి కొన్ని కీలక మార్పులను అమలు చేస్తున్నారు. ఈ మార్పులు వినియోగదారుల భద్రతతో పాటు పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా తీసుకువచ్చినవిగా తెలుస్తోంది. ముఖ్యంగా సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ అథెంటికేషన్ కోడ్ విధానాన్ని తప్పనిసరి చేశారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పుడు వినియోగదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఒక కోడ్ వస్తుంది. డెలివరీ బాయ్ వచ్చినప్పుడు ఆ కోడ్ చెప్పిన తరువాతే సిలిండర్ అందజేస్తారు. ఈ విధానం వల్ల అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే కేవైసీ ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఆధార్ వివరాలు, ఈ-కేవైసీ పూర్తి చేయని వినియోగదారులకు సబ్సిడీ నిలిపివేయబడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు తమ వివరాలను వెంటనే నవీకరించుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ సేవలను కూడా మరింత ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు గ్యాస్ బుకింగ్ కోసం ఏజెన్సీకి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ యాప్, వెబ్‌సైట్ లేదా వాట్సాప్ ద్వారా సులభంగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. చెల్లింపులు కూడా ఆన్‌లైన్‌లోనే పూర్తిచేయవచ్చు. వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌కు మొబైల్ నంబర్ లింక్ అయిందో లేదో పరిశీలించుకోవాలి. సబ్సిడీ పొందాలంటే ఆధార్ సీడింగ్ పూర్తి చేయడం తప్పనిసరి. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత సంస్థల కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించాలని

# 710 కి.మీ రేంజ్‌తో కొత్త ఎలక్ట్రిక్ కారు



**హైదరాబాద్, మే 2 :** ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో కొత్త సంచలనం సృష్టిస్తూ ప్రముఖ సంస్థ దీణ తన తాజా ఎస్‌యూవీ 'సాంగ్ అల్ట్రా ఈవీ'ను విడుదల చేసింది. ఒకసారి పూర్తి ఛార్జ్ చేస్తే 710 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యంతో ఈ కారు మార్కెట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వాహనానికి ప్రధాన హైలైట్ వేగవంతమైన ఛార్జింగ్ వ్యవస్థ. కేవలం 9 నిమిషాల్లోనే 97 శాతం వరకు ఛార్జ్ అవుతుందని కంపెనీ వెల్లడించింది. అదేవిధంగా 5 నిమిషాల్లో 10 నుంచి 70 శాతం వరకు ఛార్జ్ అయ్యే సౌకర్యం కూడా ఉంది. పొడవు 4,850 మిల్లీమీటర్లు, వెడల్పు 1,910 మిల్లీమీటర్లు, ఎత్తు 1,670 మిల్లీమీటర్లుగా ఉండే ఈ కారు లోపల విస్తారమైన స్థలాన్ని అందిస్తుంది. 2,840 మిల్లీమీటర్ల వీల్‌బేస్‌తో ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పిస్తుంది. బ్యాటరీ విషయంలో రెండు ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. 68.4 కిలోవాట్ బ్యాటరీతో 605 కి.మీ., 82.7 కిలోవాట్ బ్యాటరీతో 710 కి.మీ. వరకు ప్రయాణించవచ్చు. 362 హార్స్‌పవర్ శక్తితో పనిచేసే ఎలక్ట్రిక్ మోటార్ ఈ కారుకు మంచి పనితీరును అందిస్తుంది. ఇంటీరియర్ ఫీచర్లలో 15.6 అంగుళాల టచ్‌స్క్రీన్, డిజిటల్ డిస్‌ప్లే, హెడ్-అప్ డిస్‌ప్లే వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. అలాగే 27 సెన్సార్లు, లిడార్ టెక్నాలజీతో కూడిన స్మార్ట్ డ్రైవింగ్ వ్యవస్థ వాహనాన్ని స్వయంచాలకంగా నడిపే సదుపాయాన్ని కల్పిస్తుంది. అందుబాటు ధరతో పాటు అత్యాధునిక ఫీచర్ల కారణంగా ఈ ఎలక్ట్రిక్ కారు విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ డిమాండ్ సంపాదించుకుంది. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో ఈ మోడల్ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బంగారం మళ్లీ పెరుగుదల

**హైదరాబాద్, మే 2:** పసిడి ప్రియులకు ఒకరోజు ఊరటనిచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. నిన్న తగ్గిన ధరలు ఈ రోజు మళ్లీ పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో ఈరోజు ఉదయం 10 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,50,930కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల బంగారం రూ. 1,38,350 వద్ద ట్రేడ్ అవుతుండగా, 18 క్యారెట్ల బంగారం రూ. 1,13,200 వద్ద కొనసాగుతోంది. నిన్నటి ధరలతో పోలిస్తే 24 క్యారెట్లపై రూ. 330, 22 క్యారెట్లపై రూ. 300, 18 క్యారెట్లపై రూ. 250 చొప్పున పెరుగుదల నమోదైంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,50,930గా ఉ ండగా, ఢిల్లీలో రూ. 1,51,230, చెన్నైలో రూ. 1,52,730 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక వెండి ధరలు మాత్రం బంగారానికి భిన్నంగా భారీగా పెరుగుతున్నాయి.

# సన్ రైజర్స్ హైదరాబాద్ ఆరో విజయానికి బ్రేక్?

## కేకేఆర్‌లోకి స్టార్ ప్లేయర్ ఎంట్రీ..

ఉప్పల్ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) జట్ల మధ్య ఆసక్తికరమైన పోరు జరగనుంది. ప్రస్తుతం హైదరాబాద్ వరుసగా ఐదు విజయాలతో ఊపుమీదుంటే, కోల్‌కతా తన ఓపెనింగ్ సమస్యలతో సతమతమవుతోంది. ఎలాగైనా హైదరాబాద్ మీద గెలవాలన్న కసితో కేకేఆర్ ప్రణాళికలు రచిస్తోంది.




**హైదరాబాద్ దూకుడు.. కోల్‌కతా కష్టాలు..**

హైదరాబాద్ బౌలర్ ప్రఫుల్ హింగే నెట్స్‌లో కొత్త బంతితో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. కోల్‌కతా టాప్ ఆర్డర్ బ్యాటర్లను ఆరంభంలోనే దెబ్బకొట్టాలని చూస్తున్నాడు. ముఖ్యం గా అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ ఫామ్ హైదరాబాద్‌కు పెద్ద ప్లస్ పాయింట్. ఈ సీజన్ లో కోల్‌కతా ఓపెనర్లు అస్సలు రాణించడం లేదు. రహానే ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. సునీల్ నరైన్ మళ్ళీ ఓపెనర్‌గా వస్తాడా లేదా అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది.

కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) భారీ ధర 18 కోట్లకు కొనుగోలు చేసిన శ్రీలంక పేసర్ మతీష పతిరాణ, జట్టులోకి వచ్చి రెండు మ్యాచ్‌లు గడిచినా ఇంకా మైదానంలోకి దిగలేదు. గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరిన పతిరాణ, రేపు హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడతాడా లేదా అన్నది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. బౌలింగ్ కోచ్ టిమ్ సౌథీ మాట్లాడుతూ.. పతిరాణ నెట్స్‌లో బాగా బౌలింగ్ చేస్తున్నాడని, పిచ్ పరిస్థితులను బట్టి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం కేకేఆర్ ఓవర్సీస్ ఆటగాళ్లుగా గ్రీన్, నరైన్, సీఫెర్ట్, పావెల్‌లను ఆడిస్తోంది. అయితే సీఫెర్ట్ వరుసగా డకౌట్ అవ్వడం, పావెల్ రాణించకపోవడంతో పతిరాణ లేదా ఫిన్ అలెన్‌లకు అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. వరుస విజయాలతో ఉన్న కేకేఆర్, పతిరాణను జట్టులోకి తెచ్చి బౌలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. హైదరాబాద్‌లో ఎండలు మండిపోతున్నాయి, రేపు సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండవచ్చు. ఈ మ్యాచ్ మూడో నంబర్ పిచ్‌పై జరుగుతుంది. సాధారణంగా ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్లకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిచ్ కొంచెం నెమ్మదించే అవకాశం ఉన్నా, పరుగులకైతే లోటుండదు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో క్లాసెన్ దిట్ట. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో అతను 200 పైగా స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేస్తాడు. ట్రావిస్ హెడ్ పరుగులు చేయకుండా కట్టడి చేయడంలో నరైన్ రికార్డ్ బాగుంది. ఈ సారి పకడ్బందీ ప్రణాళికతో కేకేఆర్ బరిలోకి దిగి సన్ రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు కళ్లెం వేయాలనే ఆత్రుతతో ఉంది. రికార్డుల పరంగా కోల్‌కతాకు హైదరాబాద్‌పై మంచి ఆధిపత్యం (20-11) ఉన్నా.. ప్రస్తుత ఫామ్ చూస్తే మాత్రం సన్‌రైజర్స్‌దే పైచేయిలా కనిపిస్తోంది. మరి ఉప్పల్ గడ్డపై 'ఆరెంజ్ ఆర్మీ' ఆరో విజయం సాధిస్తుందో లేదో చూడాలి.




# సొంతగడ్డపై చెన్నై గర్జన!

## ముంబై ఇండియన్స్ పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం


### కెప్టెన్ రుతురాజ్ (67 నాటౌట్), కార్తీక్ శర్మ (54 నాటౌట్) అజేయ ఇన్నింగ్స్

## వృథా అయిన నమన్ ధీర్ (57) మెరుపులు

### 3 వికెట్లతో సత్తా చాటిన చెన్నై బౌలర్ అన్షుల్ కాంబోజ్

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా శనివారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠ పోరులో ముంబై ఇండియన్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబై నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని చెన్నై బ్యాటర్లు ఎంతో అలవోకగా ఛేదించారు. లక్ష్య ఛేదనలో 18.1 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 160 పరుగులు సాధించి సొంతగడ్డపై జయభేరి మోగించింది. చెన్నై గెలుపులో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కీలక పాత్ర పోషించాడు. 48 బంతులు ఎదుర్కొన్న రుతురాజ్ 67 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ముందుండి నడిపించాడు. అతనికి జతగా కార్తీక్ శర్మ సైతం 40 బంతుల్లో 54 పరుగులతో క్రీజులో పాతుకుపోయి విజయాన్ని లాంఛనం చేశాడు. అంతకుముందు ఓపెనర్ ఉర్విల్ పటేల్ కేవలం 12 బంతుల్లో 24 పరుగులతో మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. ముంబై బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 3 ఓవర్లలో 20 పరుగులిచ్చి 1 వికెట్ తీయగా, అల్లాహ్ గజన్ఫర్ 4 ఓవర్లలో 40 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా 2 ఓవర్లలో 17 పరుగులిచ్చి వికెట్లేమీ తీయలేకపోయాడు.

అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ముంబై బ్యాటర్లలో నమన్ ధీర్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 37 బంతుల్లోనే 57 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ర్యాన్ రికెల్టన్ 24 బంతుల్లో 37 పరుగులు చేయగా, సూర్యకుమార్ యాదవ్ 12 బంతుల్లో 21 పరుగులతో పర్వాలేదనిపించాడు. అయితే చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలమయ్యారు. అన్షుల్ కాంబోజ్ 4 ఓవర్లలో 32 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు




పడగొట్టి ముంబైని దెబ్బకొట్టాడు. నూర్ అహ్మద్ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా.. జామీ ఓవర్టన్ 4 ఓవర్లలో 23 పరుగులిచ్చి 1 వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. బౌలర్ల సమష్టి కృషితో ముంబైని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన చెన్నై.. ఆ తర్వాత బ్యాటర్ల జోరుతో అభిమానులకు అద్భుతమైన గెలుపును కానుకగా ఇచ్చింది.




## హనుమాన్ ఆలయంలో

# కాటేరమ్మ కొడుకు..

### నేడు కోల్ కతా నైట్ రైడర్స్ పై దబిడిదిబిడే



ఐపీఎల్ 2026 సీజన్‌లో తన మెరుపు బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను వణికిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ, కీలక మ్యాచ్‌కు ముందు దైవదర్శనం చేసుకున్నారు. మైదానంలో సిక్సర్ల వర్షం కురిపించే ఈ యువ కెరటం, భక్తి భావంతో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత సీజ న్‌లో అభి షేక్ శర్మ ఆడుతున్న తీరు అద్భుతం. సన్ రైజర్స్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇవ్వడంలో ఆయనది కీలక పాత్ర. ముఖ్యంగా పవర్ ప్లే ఓవర్లలో క్రీజులోకి వచ్చిన క్షణం నుండే బౌండరీల వేట మొదలు పెడుతు న్నారు. ఆయన కొట్టే భారీ సిక్సర్లు, వేగవంతమైన అర్ధ సెంచరీలు హైదరాబాద్ జట్టుకు భారీ స్కోర్లు అందిం చడంలో ప్రధాన బలమయ్యాయి. కేవలం పరుగులే కాకుండా, ఆయన ఆడుతున్న స్ట్రైక్ రేట్ చూస్తుంటే ప్రత్యర్థి జట్లకు చెమటలు పడుతున్నాయి.

**హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు..**

ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (KKR)తో సన్‌రైజర్స్ తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు అభిషేక్ శర్మ నగరంలోని కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. సాధారణ ఆఫ్-వైట్ టీ షర్ట్ ధరించి, నుదుట ఎర్రటి తిలకం దిద్దుకుని చాలా ప్రశాంతంగా కనిపించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మ్యాచ్‌లో విజయం సాధించాలని మొక్కుకున్నారు. హనుమంతుడి విగ్రహం ముందు ఆయన భక్తితో చేతులు జోడించి ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నగరంలో ఉన్న సమయంలో అభిషేక్ శర్మ కేవలం కర్మన్‌ఘాట్ ఆలయమే కాకుండా, అంతకుముందు బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయాలను కూడా దర్శిం చుకోవడం విశేషం.

అభిషేక్ శర్మ పోస్ట్ చేసిన ఈ ఫోటోలపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "జై భజరంగబలి" అంటూ కామెంట్స్ చేస్తూ, రేపటి మ్యాచ్‌లో ఆయన మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాలని ఆకాంక్షిస్తున్నారు. ఆటలో ఎంత వేగంగా ఉంటారో, బయట అంత ప్రశాంతంగా, సంప్రదాయబద్ధంగా ఉండటం చూసి ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు జరగబోయే ఈ మ్యాచ్ సన్‌రైజర్స్‌కు చాలా కీలకం. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగాలన్నా, ప్లే-ఆఫ్స్ దిశగా దూసుకుపోవాలన్నా అభిషేక్ శర్మ ఇచ్చే ఆరంభం జట్టుకు ఎంతో అవసరం. దైవ దీవెనలతో ఈ యువ ఆటగాడు రేపు మైదానంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో వేచి చూడాలి.

# వైభవ్ సూర్యవంశీపై 'చైల్డ్ లేబర్' వివాదం



**ముంబై:**

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు కొత్త వివాదానికి కేంద్రబిందువయ్యాడు. బీహార్‌కు చెందిన ఈ యువ ఆటగాడు తన దూకుడు బ్యాటింగ్‌తో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుండగా, ఓ కన్నడ సామాజిక కార్యకర్త చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ లోకి అడుగుపెట్టిన వైభవ్, ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌పై శతకం బాది అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే అతడి వయసును ప్రస్తావిస్తూ, ఇంత చిన్న వయసులో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడించడం బాలకార్మిక చట్టాల పరిధిలోకి వస్తుందని ఆ కార్యకర్త ఆరోపించారు. అతని వాదన ప్రకారం, చిన్న వయసులోనే భారీ కాంట్రాక్టులతో ప్రొఫెషనల్ స్థాయిలో ఒత్తిడి కలిగించడం సరైంది కాదని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయితే భారత చట్టాల ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం అయినప్పటికీ, 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న వారిపై వేర్వేరు నిబంధనలు అమల్లో ఉంటాయి. ప్రమాదకర రంగాలు కాకుండా క్రీడలు వంటి విభాగాల్లో అవకాశాలు ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. బీసీసీఐ, ఐపీఎల్ నిబంధనల ప్రకారమే వైభవ్ ఎంపికైన నేపథ్యంలో ఈ ఆరోపణలకు ఎంత బలం ఉందన్నది చర్చగా మారింది. వివాదం పక్కన పెడితే, వైభవ్ మాత్రం బ్యాట్‌తోనే తన ప్రతిభను నిరూపిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే కీలక పరుగులు సాధిస్తూ రాజస్థాన్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. అధికారిక ఫిర్యాదు లేదా స్పందన ఇంకా వెలువడకపోయినా, ఈ అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# టీ20 వరల్డ్ కప్ కోసం భారత మహిళల జట్టు ప్రకటన..

**ముంబై:**

2026 మహిళల టీ20 ప్రపంచకప్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శక్తివంతమైన 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జూన్ 14 నుంచి ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీలో టైటిల్ గెలవాలనే లక్ష్యంతో భారత్ బలమైన కూర్పుతో బరిలోకి దిగుతోంది.జట్టుకు అనుభవజ్ఞురాలు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్ బాధ్యతలు చేపట్టనుంది. అనుభవం, ప్రస్తుత ఫామ్ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు జట్టును ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది.బ్యాటింగ్ విభాగంలో షెఫాలి వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ వంటి కీలక ఆటగాళ్లు జట్టుకు బలం కానున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మరోసారి ప్రధాన అస్త్రంగా మారనుంది. గాయంతో దూరమైన అమన్‌జోత్ కౌర్ స్థానంలో డబ్ల్యూపీఎల్‌లో రాణించిన యువ ఆటగాళి భారతి ఫుల్‌మాలికి అవకాశం లభించింది.బౌలింగ్ విభాగంలో రేణుకా సింగ్ ఠాకూర్ పేస్ దళాన్ని నడిపించనుండగా, నందిని శర్మ ఎంపిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్పిన్ విభాగంలో రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి కీలక బాధ్యతలు చేపట్టనున్నారు.అనుభవజ్ఞులైన హర్లీన్ డియోల్, స్నేహ రాణాలకు చోటు లేకపోవడం ఆశ్చర్యం కలిగించినా, యువ ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ దృష్టితో ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. స్టాండ్‌బై ప్లేయర్లకు అవకాశం ఇవ్వకుండా నేరుగా 15 మందితోనే బలమైన జట్టును ఖరారు చేశారు.ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సమతూకంగా ఎంపికైన ఈ జట్టుపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వన్డే ప్రపంచకప్ విజయోత్సాహాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు టీ20 కిరీటాన్ని కూడా సొంతం చేసుకోవాలని భారత మహిళల జట్టు పట్టుదలగా కనిపిస్తోంది.



ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
ఆదివారం
3 మే 2026

# పెద్ది విధ్వంసానికి ఆకాశమే హద్దు



ఈ ఏడాది సంక్రాంతి సినిమాల సందడితో ఎంతో ఆశాజనకంగా మొదలైన టాలీవుడ్ బాక్సాఫీస్.. ఆ తర్వాత ఎంత వెలవెలబోయిందో తెలిసిందే. వేసవిలో ఏవేవో పెద్ద, క్రేజీ సినిమాలు వస్తాయని అనుకుంటే.. వాటిలో చాలా వరకు వాయిదా పడిపోయాయి. పవన్ కళ్యాణ్ సినిమా ఉస్తాద్ భగత్ సింగ్ తీవ్ర నిరాశకు గురి చేసింది. మొత్తంగా వేసవి సీజన్ సరైన సినిమాలు లేక వెలవెలబోయింది. వేసవిలో బిగ్గెస్ట్ సెలబ్రేషన్ అవుతుందనుకున్న పెద్ది మూవీ ఈ సీజన్‌ను మిస్ చేయడం మెగా అభిమానులనే కాక.. సామాన్య ప్రేక్షకులనూ తీవ్ర నిరాశకు గురి చేసింది. ఐతే ఏప్రిల్ 30 నుంచి వాయిదా పడ్డప్పటికీ.. మరీ ఆలస్యం చేయకుండా, ఇంకో ఐదు వారాలకే సినిమాను రిలీజ్ చేయబోతుండడం అభిమానులకు గొప్ప ఉపశమనమే. జూన్ తొలి వారంలో ఈ సినిమా ఇండియా వైడ్ బాక్సాఫీస్‌లో వసూళ్ల సునామీ సృష్టించబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఏడాది దురంధర్ తర్వాత పాన్ ఇండియా స్థాయిలో పెద్ద హిట్ కాగల సత్తా ఉన్న సినిమా పెద్దినే. చికిరి పాట సహా ఈ మూవీ ప్రోమోలన్నీ పాన్ ఇండియా స్థాయిలో మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. రిలీజ్ టైంకి ఇండియా వైడ్ సినిమాకు మంచి బజ్ క్రియేట్ కావడం ఖాయం.

## సైలెంట్ మోడ్ లో సమంత మా ఇంటి బంగారం



టాలీవుడ్ టాప్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు స్వయంగా నిర్మిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. 'ఓ బేబీ' లాంటి సూపర్ హిట్ తర్వాత సామ్ - నందిని రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఉన్నాయి. అయితే, ఈ సినిమా విడుదల తేదీ విషయంలో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. మే 15న రిలీజ్ అని మేకర్స్ గతంలో ప్రకటించారు. సుమతో ఒక ఇంటర్వ్యూ సహా సమంత పుట్టినరోజు ఈవెంట్స్ కాకుండా పెద్దగా ప్రమోషన్స్ ఏవి చేయ లేదు. నిజానికి మొదట మే 15ను పక్కా డేట్‌గా భావించారు. ముఖ్యంగా యష్ 'టాక్సిక్' సినిమా వాయిదా పడటంతో, ఆ విండోను క్యాష్ చేసుకోవాలని ప్లాన్ చేసిన కొందరు డిస్ట్రిబ్యూటర్లు సినిమాని జూన్ 4వ తేదీన రిలీజ్ చేయించాలని అనుకున్నారు. కానీ, తాజా పరిణామాలు చూస్తుంటే పరిస్థితులు మారినట్లు కనిపిస్తోంది. జూన్ 4న 'పెద్ది' వస్తుండటం, ఆ వెంటనే జూన్ నెలాఖరులో 'లెనిన్' వంటి భారీ చిత్రాలు లైన్లో ఉండటంతో సమంత సినిమాకు సరైన రిలీజ్ డేట్ దొరకడం సవాల్‌గా మారింది. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' టీమ్ ముందు రెండు ఆప్షన్లు మాత్రమే కనిపిస్తున్నాయి, అవేమంటే పెద్దగా రిస్క్ చేయకుండా మే 15నే రావడం, లేదా రిస్క్ చేసి పెద్ది రిలీజ్ అనంతరం జూన్ రెండో వారం లేదా జూన్ మధ్యలో రిలీజ్ ప్లాన్ చేయడం. సమంతనందిని రెడ్డి కాంబో అంటే కచ్చితంగా మినిమం గ్యారెంటీ కంటెంట్ ఉంటుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. అయితే సినిమా ఎంత బాగున్నా, బాక్సాఫీస్ వద్ద సరైన వసూళ్లు రావాలంటే పక్కా రిలీజ్ ప్లానింగ్ అవసరం. ప్రమోషన్స్ లేకుండా సడన్‌గా థియేటర్లలోకి వస్తే బాక్సాఫీస్ ఇంపాక్ట్ పడే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరి సమంత ఈ సస్పెన్స్‌కు ఎప్పుడు స్వస్తి పలుకుతుందో చూడాలి. 'మా ఇంటి బంగారం' నిజంగానే మే నెలలో మెరుస్తుందా? లేక జూన్‌కు షిఫ్ట్ అవుతుందా? అన్నది త్వరలోనే తేలనుంది.

## టోకెన్ స్ట్రైక్'కి దిగిన తమిళ నిర్మాతలు!

తమిళ చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. థియేటర్ యాజమాన్యాలు ఏకపక్షంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలకు వ్యతిరేకంగా 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' మే 2వ తేదీన ఒక రోజు 'టోకెన్ స్ట్రైక్' (నిరసన ప్రదర్శన) కు దిగారు. సాధారణంగా సినిమా వసూళ్ల లో థియేటర్ యాజమాన్యాలకు, నిర్మాతలకు మధ్య ఒక ఒప్పందం ఉంటుంది. అయితే, ఇటీవల థియేటర్ యజమానులు ముందస్తు సమాచారం లేకుండా, అకస్మాత్తుగా 'రెవెన్యూ షేర్' పద్ధతిని అమలులోకి తెచ్చారు. ఈ విధానం వల్ల నిర్మాతలకు వచ్చే లాభాల్లో భారీ కోత పడుతుందని, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా బడ్జెట్ చిత్రాల మనుగడ కష్టమవుతుందని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒక రోజు నిరసన వల్ల పరిశ్రమలో కొన్ని రంగాలు స్తంభించిపోయాయి. ఈ వారంలో విడుదల కావాల్సిన సినిమాలపై ఈ ప్రభావం పడనుంది. థియేటర్లతో సయోధ్య కుదిరే వరకు కొత్త సినిమాల విడుదలను నిలిపివేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ఎడిటింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ వంటి పనులు ఈ రోజు నిలిచిపోయే అవకాశం ఉంది. దీనివల్ల రాబోయే సినిమాల షెడ్యూల్స్ కొంతవరకు ఎఫెక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. అయితే, రోజువారీ కూలీలపై ఆధారపడే కార్మికులను దృష్టిలో ఉంచుకుని, సినిమాల షూటింగ్‌లను మాత్రం ఆపకూడదని అసోసియేషన్ నిర్ణయించింది. ఇది ఒక సానుకూల పరిణామం. ఈ పోరాటంలో దక్షిణ భారత చలనచిత్ర కార్మికుల సమాఖ్య (FEFSI)తో పాటు ఇతర సినీ అనుబంధ సంఘాల మద్దతును కూడా ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కోరింది. ఒకవేళ థియేటర్ యాజమాన్యాలు తమ మొండి వైఖరిని వీడకపోతే, ఈ నిరసన మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

## తడబడుతున్న మమిత బైజు అడుగులు



రెండేళ్ల క్రితం 'ప్రేమలు' విడుదలైనప్పుడు అందులో హీరో కన్నా ఎక్కువ పేరు వచ్చింది మమిత బైజుకే. హుషారైన నటన, జెన్ జీని ప్రతిబింబించే బాడీ లాంగ్వేజ్ యువతను బాగా ఆకట్టుకున్నాయి. మలయాళంలోనే కాదు తెలుగులోనూ ప్రేమలు పెద్ద హిట్టయి తనకు మంచి క్రెడిట్ ఇచ్చింది. సరిగ్గా ఫోకస్ పెడితే అగ్ర హీరోయిన్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ కోలీవుడ్ పత్రికలు హోరెత్తించాయి. అయితే మమిత అడుగులు తడబడుతున్నాయని చెప్పాలి.


తాజాగా విడుదలైన 'కర'లో ధనుష్ భార్యగా ఏ మాత్రం ప్రాధాన్యం లేని పాత్ర పోషించింది. సినిమా ప్రారంభంలో ఓ రెండు నిమిషాల ఎమోషనల్ సీన్ తర్వాత తను మళ్ళీ ఎక్కడా కనిపించదు. సెకండాఫ్ లో స్క్రీన్ స్పేస్ కొన్ని క్షణాలు మాత్రమే ఉంటుంది. ఇంత తక్కువ నిడివి వల్ల సాధించిందేమిటో అర్థం కాదు. రిలీజ్ కోసం సర్కస్ చేస్తున్న 'జన నాయకుడు'లోనూ ఆమె హీరోయిన్ కాదు. భగవంత్ కేసరిలో శ్రీలీల క్యారెక్టర్ తమిళంలో మమిత బైజు చేసింది. అంతే.

'డ్యూడ్' సక్సెస్ అయినా దాని క్రెడిట్ అధిక శాతం ప్రదీప్ రంగనాథన్ కు వెళ్ళిపోయింది. త్వరలో విడుదల కాబోయే 'విశ్వనాథ్ అండ్ సన్స్' లో నలభై ఏళ్ళ వ్యక్తిని ప్రేమించే ఇరవై సంవత్సరాల అమ్మాయిగా పెద్ద రిస్క్ చేస్తోంది. సూర్య సరసన రెగ్యులర్ జోడిగా అయినా పర్వాలేదు కానీ క్యారెక్టర్ పరంగా మరీ ఇంత ఏజ్ గ్యాప్ ఉన్న రోల్ చేయడం రేపు జనాలు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి. ప్రేమలు తర్వాత వెంటనే చేసిన 'కామ్రేడ్' కూడా మమితకు డిజాస్టరే ఇచ్చింది.

## మేం కాపులం వివాదం.. ప్రమోషన్ కోసమా ?

సోషల్ మీడియాలో గత కొద్దిరోజులుగా ఓ చిన్నపాటి తుపాను రేపిన "మేము కాపులం" వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఒక వర్గం ప్రేక్షకులను ఆందోళనకు గురిచేసి, మరికొందరిలో ఆసక్తిని రేకెత్తించిన ఈ టైటిల్ వెనుక ఉన్న అసలు గుట్టు విడిపోయింది. ఒక చిన్న వీడియో క్లిప్‌లో నటుడు గెటప్ శ్రీను, మెగా బ్రదర్ నాగబాబు కలిసి నటిస్తున్న ప్రాజెక్టుకు 'మేము కాపులం' అనే టైటిల్ ఖరారు చేసినట్లు గెటప్ శ్రీను పేర్కొనగా ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్ట్ జాఫర్ స్పందిస్తూ.. "కులం పేరుతో సినిమాలు తీయడం ఏంటి? ఇది సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తుంది? నాకు అస్సలు నచ్చలేదు" అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు. దీంతో గెటప్ శ్రీను నేను ఇంటర్వ్యూ నుంచి వెళ్లిపోతా అని అంటూ వెళ్ళిపోవడం వైరల్ అవుతుంది.

ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవ్వడంతో, నెటిజన్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి చర్చించుకోవడం మొదలుపెట్టారు. అయితే, ఇదంతా ఒక తెలివైన ప్రమోషనల్ స్టంట్ అని తాజాగా స్పష్టమైంది. ఈ సిరీస్ అసలు టైటిల్ 'మేము COPలం' (Memu COPulam). ఇక్కడ COP అంటే ఆంగ్లంలో పోలీస్ అని అర్థం. అంటే ఈ సిరీస్ పోలీసుల చుట్టూ, వారి విధుల్లో ఎదురయ్యే కామెడీ మరియు సవాళ్ల చుట్టూ తిరుగుతుందని టీం క్లారిటీ ఇచ్చింది. ఉచ్చారణలో రెండు పదాలు ఒకేలా ఉండటంతో వచ్చిన చిన్నపాటి కన్ఫ్యూజన్‌ను మేకర్స్ తమ సిరీస్ పబ్లిసిటీకి చాలా చాకచక్యంగా వాడుకున్నారు. ఓటీటీ జీ5 (ZEE5) ఒరిజినల్స్‌లో భాగంగా ఈ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఇదొక ఇన్వెస్టిగేటివ్ కామెడీ అని సమాచారం. పోలీసు శాఖలో జరిగే ఆసక్తికర పరిణామాలు, మన చుట్టూ ఉండే నేరగాళ్లను పోలీసులు తమదైన స్టైల్లో ఎలా పట్టుకుంటారనేది హిలేరియస్ గా చూపించబోతున్నారు. త్వరలోనే ఈ సిరీస్ ట్రైలర్, విడుదల తేదీ గురించి మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి. పోలీసు డ్రెస్సులో గెటప్ శ్రీను పండించే కామెడీని చూడాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే!



## 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్‌పై కియారా టెన్షన్?..

**యష్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతుండగా, హీరోయిన్ కియారా అద్వానీకి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమా ఫైనల్ కట్ చూసిన తర్వాత యష్‌తో ఉన్న కొన్ని బోల్డ్, ఇంటిమేట్ సన్నివేశాలపై కియారా ఆందోళన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. స్క్రీన్‌పై అవి మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయని భావించిన ఆమె, ఆ సీన్లను తగ్గించాలా లేదా తొలగించాలా అని చిత్రబృందాన్ని కోరినట్లు టాక్. అయితే దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాత్రం కథకు ఆ సన్నివేశాలు కీలకమనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్‌లో తన ఇమేజ్‌ను కాపాడుకునే దిశగా కియారా మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్తపై అధికారిక స్పష్టత లేకపోయినా, 'టాక్సిక్'పై మాత్రం మరింత హైప్ పెరిగింది.**

## మరోసారి బాలయ్యకు జోడీగా కాజల్



నటసింహం నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో 111వ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టు #NBK111పై తాజాగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మొదట ఈ సినిమాలో బాలయ్య సరసన నయనతార నటించనున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఇప్పుడు ఆమె స్థానంలో కాజల్ అగర్వాల్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. 'సింహా', 'శ్రీరామ రాజ్యం', 'జై సింహా' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత బాలకృష్ణనయనతార జోడీ మరోసారి తెరపై కనిపిస్తుందనే అంచనాలు అభిమానుల్లో నెలకొన్నాయి. అయితే షెడ్యూల్ సమ స్యలు, పారితోషిక అంశాలు ఈ కాంబి నేషన్‌కు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తు తం నయనతార బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్‌తో ఓ భారీ ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటంతో ఆమె తేదీలు సర్దుబాటు చేయడం కష్టమైందని సమాచారం. అదే సమయంలో ఈ చిత్రం కోసం నయనతార భారీ స్థాయిలో రెమ్యునరేషన్ కోరినట్లు టాక్ నడుస్తోంది. ప్రమోషన్లకు దూరంగా ఉండే ఆమె విధానం కూడా నిర్మాతలను మరో ఆలోచనలో పడేసినట్లు చెబుతున్నారు. దీంతో మేకర్స్ కొత్త ఆప్షన్ కోసం వెతికి చివరకు కాజల్ అగర్వాల్‌ను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే 'భగవంత్ కేసరి'లో బాలయ్యతో స్క్రీన్ షేర్ చేసుకున్న కాజల్, ఈసారి మాత్రం పూర్తి స్థాయి హీరోయిన్ పాత్రలో కనిపించనుందట. తక్కువ పారితోషికంతో పాటు ప్రమోషనల్ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడానికి ఆమె అంగీకరించిందని తెలుస్తోంది. దీంతో నిర్మాతలు కూడా కాజల్ ఎంపికపై సంతృప్తిగా ఉన్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717